క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో బేతాళ సంబరం



వేట్లపాలెం గ్రామంలో బేతాళ స్వామిని తీసుకువస్తున్న భక్తులు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలో గురువారం బేతాళ సంబరం ప్రారంభమైంది. వేట్లపాలెం బేతాళస్వామి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా పారంభయ్యాయి. గ్రామ శివారు నుంచి బేతాళస్వామిని బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. గురువారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. ఆదివారం ఉత్సవం ముగింపు సందర్భంగా బేతాళ స్వామిని భారీ ఎత్తున ఊరేగింపుతో గ్రామ శివారుకు తీసుకువెళతారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

బదిలీ అయిన అధికారులకు సత్కారాలు



సామర్లకోట ఎంపీడీఓను సత్కరించిన ఎంపీపీ సత్తిబాబు తదితరులు

సామర్లకోట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు బదిలీ కావడంతో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత గురువారం సాయంత్రం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణా రెడ్డి, ఏఓ మంగతాయారు, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ నందన్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రూపలతో పాటు ఇద్దరు అటెండర్లు బదిలీ అయ్యారు. దాంతో వారిని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. కాగ ఎంపీడీఓగా హిమమహేశ్వరీ, ఈఓ పీఆర్డీ భైరవమూర్తు సామర్లకోటకు బదిలీపై వస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత పక్వాడా



సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫాం శుభ్రతను ప్రారంభించిన అధికారులు

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి స్వచ్ఛత పక్వాడా పనులను ప్రారంభించినట్టు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. దీనిలో భాగంగా యంత్రాలతో ప్లాటుఫారాలు, కార్యాలయాలు, మరుగుదొడ్లును శుభ్రం చేయడం జరిగిందన్నారు. అలాగే స్టేషన్ పరిధిలోని డ్రైన్లను సిబ్బంది సహకారంతో శుభ్రం చేయించినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండటమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సహజీవనం

- శిథిలావస్థలో అపార్ట్‌మెంట్లు
- నిర్విరామంగా పైప్‌లైన్ల లీకులు
- క్షీణించిన పారిశుధ్యం
- అధికారులకు పట్టని ఎన్‌టీఆర్ కాలనీ

పెద్దాపురం: స్థానిక జగ్గంపేట రహదారిలోని ఎన్‌టీఆర్ కాలనీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. పారిశుధ్యం క్షీణించి, తాగునీటి పైపుల లీకులతో అపార్టుమెంట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి.

కాలనీకి చేరుకోవాలన్నా నరకమే..

ఆ ప్రాంత వాసులు కాలనీకి చేరుకోవాలన్నా నరకం అనుభవిస్తున్నారు. స్థానిక నవోదయ విద్యాలయ నుంచి కట్టమూరు జంక్షన్ వరకు రహదారి మరింత గోతులతో ఉండడంతో పట్టణ శివారులో కాలనీకి చేరుకోవాలంటే వాహన చోదకులు, కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పెద్దాపురం–జగ్గంపేట ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రహదారి నిర్మించకపోవడంతో వారి సమస్యలు మరింత ఎక్కువయ్యాయి.

నిత్యం నీటి వృధా..

కాలనీలోని అపార్ట్‌మెంట్లలో ఎక్కడికక్కడే



ఎన్‌టీఆర్ కాలనీ ముఖద్వారం

తాగునీటి ట్యాంకులు లీకవుతున్నాయి. ఉదయం వదిలే నీరు ప్రతి అపార్ట్‌మెంట్‌లో ఏదో ఒక బ్లాక్ నుంచి లీకవుతూ మురుగు కాలువల్లోకి చేరుతోంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

క్షీణించిన పారిశుధ్యం

కాలనీలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి,



ఎన్‌టీఆర్ కాలనీకి వెళ్లే జగ్గంపేట ప్రధాన రహదారి

ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పందుల స్వైర విహారం, డ్రెయిన్ల పూడిక తీయకపోవడంతో కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. రాత్రి వేళల్లో వీధిలైట్లు వెలగక ప్రజలు అవస్థ పడుతున్నారు.



కాలనీలో సంచరిస్తున్న పందులు

కాలనీలో ఎన్నో సమస్యలు



ఎన్‌టీఆర్ కాలనీలో ఇబ్బందులను పట్టించుకునే నాథుడు లేడు. అపార్ట్‌మెంట్‌లో చాలా వరకు యజమానులు లేకపోవడంతో అద్దెకు ఉండేవారు ఆయా ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం లేదు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

– అక్షింతల గంగాధర్, ఎన్‌టిఆర్ కాలనీ

సమస్యలపై దృష్టి సారించాలి



ఎన్‌టీఆర్ కాలనీలో సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. నిత్యం మంచినీటి సరఫరా, డ్రెయిన్ పూడిక, పారిశుధ్య పనులు మెరుగుపర్చాలి. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై స్థానిక శాసనసభ్యులు దృష్టి పెట్టాలి.

– దాకారపు వీరబాబు, ఎన్‌టీఆర్ కాలనీ

సమస్యలు పరిష్కరిస్తాం



ఎన్‌టీఆర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం. నిత్యం పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. పైపులైన్ల లీకులు, అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

అద్దె బకాయిలపై స్పెషల్ డ్రైవ్



సామర్లకోట స్టేషన్‌సెంటర్‌లో అద్దెలు బకాయి ఉన్న దుకాణాల జాబితా పరిశీలిస్తున్న ఆర్వో తదితరులు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో దుకాణాల అద్దెల బకాయిల వసూళ్లకు మున్సిపల్ రెవెన్యూ అధికారి కె.శ్యామల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేశారు. దీనిలో భాగంగా స్థానిక స్టేషన్ సెంటర్‌లో దుకాణ నిర్వాహకులకు అద్దెలు చెల్లించక పోతే తాళాలు వేస్తామని హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో అద్దెలు, పన్నులు వసూలలో వెనుకబడి ఉండటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజు వారి టార్గెట్‌లు నిర్ణయించారు. దాంతో ఆర్వో తన సిబ్బందితో షాపుల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ పరిధిలోని 15 సచివాలయాలోని అడ్మిన్లు, కార్యదర్శులకు డిసెంబరు 31 నాటికి 100 శాతం వసూళ్లు ఉండాలని లక్ష్యం ఇచ్చారు.

ఒకటో సచివాలయానికి రూ.34 వేలు, రెండో సచివాలయానికి రూ.49వేలు, మూడో సచివాలయానికి రూ.40వేలు, నాలుగుకు రూ.28వేలు, ఐదుకు రూ.18 వేలు, ఆరుకు రూ.16వేలు, ఏడుకు రూ.29వేలు, ఎనిమిదికి రూ.17 వేలు, తొమ్మిదికి రూ.32వేలు, పదికి రూ.64వేలు, 11కు రూ.79 వేలు, 12కు రూ. 80 వేలు, 13కు రూ.26వేలు, 14కు రూ.55 వేలు, 15కు రూ.70 వేలు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య లక్ష్యంగా నిర్ణయించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష



ఎంఈఓకు వినతి పత్రం అందజేసిన యూటీఎఫ్ ప్రతినిధులు

సామర్లకోట: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష ప్రారంభించారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలపై పట్టణ గౌరవ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ శాఖ జిల్లా అధ్యక్షుడు కె.నగేష్ మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, మున్సిపల్ ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులు, దీర్ఘకాలికంగా పని చేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలన్నారు. ఈనెల 26న నిర్వహించనున్న 24 గంటల దీక్షను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని నగేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.గిరిధరగోపాలరావు, ఎం.వీరమణి, ఎస్.రాజు, కె.శ్రీనివాసు, సయ్యద్ సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు ఆత్మీయ సత్కారం



ఆర్డీఓ సీతారామారావు దంపతులను సత్కరించిన విశాలాక్షి నగర్ ప్రజలు

సామర్లకోట: పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావుకు గురువారం సాయంత్రం ఆత్మీయ సత్కారం జరిగింది. సుమారు రెండేళ్లుగా స్థానిక ఆర్డీఓగా విధులు నిర్వహిస్తూ స్థానిక విశాలాక్షి నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల ఆయన బదిలీ కావడంతో ఆ ప్రాంత ప్రజలు ఆర్డీఓ సీతారామారావు, స్వరూప దంపతులను సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ మేరకు దుశ్శాలువ, నూతన వస్త్రాలు, జ్ఞాపికతో ఆ దంపతులను సత్కరించారు. ఆర్డీఓ పెద్దల నుంచి ఆశీస్సులు తీసుకుని పిల్లలకు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో రెండు రోజుల ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. రెవరెండ్ నంగిన సత్యానందం ఆధ్వర్యంలో సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన దైవజనులు జయకుమార్, వంకా జాన్ తదితరులు శాంతి సందేశం ఇచ్చారు. సంఘ సభ్యులు ఆలపించిన క్రైస్తవ భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. దైవ సేవకులు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి



కొత్తపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: పేదల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు గొడుగు సత్యనారాయణ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ–గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు మంజూరు చేయాలని, వంద రోజులు పని కల్పించాలని, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. నవంబర్ 9న విజయవాడలో జరగబోయే ప్రజా రాజకీయ సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు శీలం అప్పలరాజు, లోవకుమారి, దుర్గాభవాని, వినోద్, కమాలాకర్ తదితరులు పాల్గొన్నారు.

దిక్కుదిక్కునా దుర్గానామం



విశేష అలంకరణలో భువనేశ్వరి అమ్మవారు



బాలా త్రిపుర సుందరిగా దర్శనమిస్తున్న కాండ్రకోట నూకాలమ్మ తల్లి



పూజలందుకుంటున్న మరిడమ్మ తల్లి



సామర్లకోట అయోధ్యరామపురంలోని కనకదుర్గ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

- భక్తి శ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం
- పంచారామ క్షేత్రంలో పూజలు, హోమం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- కనకదుర్గ ఆలయాల్లో మార్మోగిన అమ్మ నామం

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం గ్రామగ్రామానా వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయంలో బిక్కిన సాయి దీక్షా వస్త్రాలను అందజేశారు. బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ బళ్ల నీలకంఠం, ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు వాడపర్తి వీరభద్రరావు భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి పాల్గొన్నారు. అభిషేక పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు భాస్కర్, శ్రీకాకుళపు వినయ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సన్నిధిరాజు అంజిబాబు దీక్షాధారణ చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిత్యం ఉదయం నుంచి దుర్గాసప్తశతి పారాయణ, బాలా పరమేశ్వరీ మంత్రజపం జరుగుతాయని ఈఓ తెలిపారు. అమ్మవారి ఆలయంలో పూజలు, అలంకరణ, హారతి అనంతరం నోరి కృష్ణారావు దంపతుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు.

ఆలయాల్లో భక్తులు పూజలు...

పట్టణ పరిధిలోని అయోధ్యరామపురంలోని కనకదుర్గ ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. సత్తెమ్మ తల్లి ఆలయం, బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ ఆలయంలోను, బ్రౌన్‌పేటలోని కనకదుర్గ ఆలయంలోను, బళ్లమార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మందిరంలోను, గాంధీచౌక్ వద్ద, రైల్వే క్వార్టర్లలో ఏర్పాటు చేసిన మందిరంలో భక్తులు పూజలు చేశారు. అలాగే నీలమ్మ చెరువు వద్ద సత్తెమ్మ తల్లి ఆలయంలో, సాయినగర్‌లోని కనకదుర్గ ఆలయంలో, భాస్కర్‌నగర్ కనకదుర్గ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నూకాలమ్మ ఆలయంలో మహిళా భక్తులచే లలితా పారాయణ చేశారు. మండల పరిధిలో హుస్సేన్‌పురం, నవర, పీబీ దేవం, జి. మేడపాడు, ఉండూరు, అచ్చంపేట, గొంచాల తదితర గ్రామాల్లో శరన్న వరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాలోని కనకదుర్గ, నూకాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: గ్రామ గ్రామానా శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు.

మరిడమ్మ, నూకాలమ్మ ఆలయాల్లో..

కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల ఈఓలు విజమలక్ష్మి, సౌజన్యల పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవార్లు బాలా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వర్తుల వారి వీధిలోని భువనేశ్వరికి పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వైభవంగా పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాదగయ క్షేత్రంలో..

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తుతున్నారు. పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, శతచండీయాగ సంకల్పము, చండీ పారాయణము, మహాగణపతి, దత్తాత్రేయ, కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, పురుహూతికా అమ్మవారికి శ్రీచక్ర సవావరణార్చన సహిత ప్రత్యేక సహస్ర పుష్పార్చన నిర్వహించారు. ప్రత్యేక పూజలలో పలువురు భక్తులు పాల్గొన్నారు. గురువారం తొలిరోజున పాదగయలోని అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణాదేవి శైలపుత్రిగా దర్శనమిచ్చారు.

గొల్లప్రోలు, పిఠాపురం కనకదుర్గ ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: మండలంలో దేవీ నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు సాగుతున్నాయి. స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వివిధ కనకదుర్గ దేవాయాల్లో 9 రోజుల పాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ కుంకుమ పూజలు, సహస్రనామార్చనలు, అభిషేకాలు, హోమాలు ఏర్పాటు చేశారు. నిత్యం ఒక అవతారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు.



ప్రత్యేకాలంకరణలో పురుహూతికా అమ్మవారు



శైలపుత్రిగా తాటిపర్తి అపర్ణాదేవి



కొత్తపల్లి గాదులదొడ్డిలో పూలతో అలంకరించిన బాలదుర్గ

వేలాది భక్తులకు భవానీ దీక్షలు

పిఠాపురం: పాదగయ క్షేత్రంలోని పురుహూతిక అమ్మవారి సన్నిధిలో గురువారం వేలాది మంది భవానీ దీక్షలు స్వీకరించారు. ఉత్సవాల ప్రారంభం రోజున ఐదు వేలకు పైగా భక్తులు భవానీ దీక్షలు స్వీకరించారు. గత వారం రోజుల నుంచి పాదగయ క్షేత్రంతో పాటు గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం, ఇతర దేవాలయాలలోను నిత్యం వందల మంది భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు.



భవానీ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

సినిమాలు



పెద్దాపురం	
లలితా స్క్రీన్–1	దేవర
లలితా స్క్రీన్–2	సత్యం సుందరం
వీరభద్ర	దక్షిణ
శోభా	శ్వాగ్
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్–1	దేవర
అనుశ్రీ స్క్రీన్–2	దేవర
విఘ్నేశ్వర	సత్యం సుందరం
పిఠాపురం	
అన్నపూర్ణ	శ్వాగ్
శ్రీపూర్ణ	దేవర
శ్రీసత్య	సత్యం సుందరం
శ్రీవెంకటేశ్వర	మిస్టర్ సెలబ్రిటీ
ఉప్పాడ	
శ్రీనివాస	మత్తు వదలరా 2